క్లుప్తంగా

ఏ.కొండాపురంలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'



ప్రచార యాత్రలో భాగంగా పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని ఏ.కొండాపురంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించినట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. గ్రామంలో ప్రచార వాహనం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ఇప్పటికే అందించిన లబ్ధిని ప్రజలకు వివరించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్, ఎంఈఓ శ్రీదేవి, వీఆర్‌ఓ రిజ్వానా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో ఈనెల 5వ తేదీ నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ భాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే గ్రామ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారన్నారు. 5న శిరివరం, 12న బూదేడు, 19న ఇల్లూరు, 23న కోటంక, ఫిబ్రవరి 6న గార్లదిన్నె-2, 13న మర్తాడు-1, 20న కల్లూరు-3, 27న యర్రగుంట్ల, మార్చి 5న కల్లూరు-1, 12న కమలాపురం, 19న కల్లూరు-2, 26 మర్తాడు-2, ఏప్రిల్ 2న పెనకచెర్ల, 16న కనంపల్లి, 23న కేశవాపురం గ్రామ సచివాలయాల్లో వైద్య శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు



అక్షింతలతో ర్యాలీగా వెళ్తున్న భక్తులు

పామిడి: మండలంలోని జీ కొట్టాల గ్రామంలో సోమవారం అయోధ్య అక్షింతలతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ పామిడి ఖండ ఆధ్వర్యంలో గ్రామవీధుల్లో అయోధ్య అక్షింతలను పంచిపెట్టారు. భక్తిగీతాలు ఆలపిస్తూ ముందుకుసాగారు. మహిళలు, చిన్నారులు, పెద్దలు కలశాలు, కాషాయ జెండాలు ధరించి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అందులో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలు పంచిపెట్టారు.

బైక్‌ల ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుధాకర్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే గుంతకల్లుకు చెందిన సుధాకర్ పని మీద గుత్తికి బైక్‌లో వెళ్తున్నాడు. అదే సమయంలో గుత్తి పట్టణంలో దాసరికొట్టాలకు చెందిన ఓ వ్యక్తి ఎదురుగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన సుధాకర్‌ను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/గుంతకల్లు: ఏపీటీఎఫ్ నూతన ఆంగ్ల సంవత్సర డైరీ, క్యాలెండర్లను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు ఆవిష్కరించారు. సోమవారం మున్సిపల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు అధికారులను కలిసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు లక్ష్మీప్రసాద్, బాబా ఫక్రుద్దీన్, రామచంద్ర, నాయకులు చంద్ర, గణేష్, ఈరన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు ఎంఈఓ కార్యాలయంలో ఏపీటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ డైరీలో ఏపీటీఎఫ్ విధి విధానాలు, బోధన పద్ధతులు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారుల ఫోన్ నంబర్లు పొందపరిచినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు వీరన్న, రామచంద్రుడు, రామిరెడ్డి, లక్ష్మీప్రసాద్, గీతారాణి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ పంపిణీ

యాడికి: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని 32 మంది లబ్ధిదారులకు 8వ విడత భూ పంపిణీ చేస్తామని తహసీల్దార్ రాజ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేతుల మీదుగా 41.90 ఎకరాల బంజరు భూములకు పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

న్యూ ఇయర్ జోష్

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- చర్చీలు, ఆలయాల్లో సందడి



శింగనమల: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి



తాడిపత్రి: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న పోలీసులు

శింగనమల: నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరూ అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆకాంక్షించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పలువురు మొక్కలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత అనుభవాలను నెమరువేసుకుంటూ పొరపాట్లకు తావులేకుండా నూతన ఆలోచనలతో ప్రజలంతా ముందుకు సాగాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనేక అంశాల్లో ఏపీ అగ్రగామిగా నిలిచిందన్నారు. వైఎస్ జగనన్న సారథ్యంలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు.

తాడిపత్రిలో..

తాడిపత్రి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పూలబొకేలు, పూలమాలలు, శాలువాలు, పూల మొక్కలు, స్వీట్లు అందజేసి సన్మానించారు. ఈ సంవత్సరం అంతా మంచి జరగాలని కోరుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అందరికీ న్యూఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. యువ నాయకులు కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

చర్చీల్లో సందడి..

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని నందలపాడు, సంజీవనగర్, సుంకులమ్మ పాలెం, సీపీఐ కాలనీలోని చర్చిల్లో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. నందలపాడులోని సీఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు యువనాయకుడు కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి పాల్గొని చిన్నారులతో కేక్ కట్ చేయించారు. ఫాదర్ డేవిడ్ అర్లప్ప ఆధ్వర్యంలో క్రైస్తవులకు దైవ సందేశాన్ని వినిపించారు. కబడ్డీ, పరుగు పందెం, లెమన్ విత్ స్పూన్, మ్యూజికల్ చైర్ వంటి క్రీడలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జాన్సన్, నాయకులు సునీల్, జోయల్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలో సోమవారం నూతన సంవత్సర సందడి నెలకొంది. ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ వైస్ కన్వీనర్ జేసీ నారాయణ రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు. వేములపాడు వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సర్పంచు ఓంకారమ్మ, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి నిర్మల కేక్ కట్ చేసి విద్యార్థినులకు పంచిపెట్టారు.

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి, బాచుపల్లి బాట సుంకలమ్మ, సేవాగఢ్‌లోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో యువకులు, విద్యార్థులు పూజలు చేశారు. చిన్న పిల్లలు ఒకరికొకరు గ్రీటింగ్స్ పంచుకున్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, కార్యాలయ ఏఓ రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది రవి, అబ్దుల్, వాసు ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డిలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. వాచ్‌నైట్ సర్వీసు ఆరాధనలో కెనడా దేశం డాక్టర్ రవికుమార్ నూతన సంవత్సర ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, అబ్రహాం, పీఎస్ రవిరాజు, బుజ్జిబాబు, బాలరాజు, అనిల్, సునీల్, ప్రసాద్, రజని, పాస్టరమ్మ సువర్ణ, మంజులా, ప్రిస్కిల్లా, చంద్రకళ, ప్రశాంతి, జయమణి పాల్గొన్నారు.

గుంతకల్లులో..

గుంతకల్లు టౌన్: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

గార్లదిన్నె: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, అనంతపురము మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి నివాసంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అనంతరం వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దవడుగూరు: మండల ప్రజలు సోమవారం నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలు, మసీదులు, చర్చీల్లో సందడి నెలకొంది. ఐఎన్ఈసీ చర్చిలో పాస్టర్ జాన్‌డేవిడ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డేనియల్, ఆనంద్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. డీఆర్‌ఎం చాంబర్‌లో డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌కు ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ పరిధిలోని జీఆర్‌పీ సిబ్బంది అక్కడికి చేరుకుని ఎస్పీ కే.చౌడేశ్వరికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాంక్షాలు తెలిపారు. డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, సీఐ నగేష్‌కుమార్, ఎస్ఐ మహేంద్ర పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. గుత్తి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, డోన్ నియోజక వర్గం పరిశీలకుడు కోనా మురళీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యాలయం, ఆర్ఎస్‌లోని జిల్లా నాయకులు ఆముదాల గిరిధర్, పగడాల శ్రీనివాసులు, బళ్లారి రాజ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి ఇళ్ల వద్ద కేక్ కట్ చేశారు.



తాడిపత్రి అర్బన్: నందలపాడులోని చర్చిలో కేక్ కట్ చేస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి



గుత్తి: కేక్ కట్ చేస్తున్న చైర్ పర్సన్ వన్నూర్‌బీ



యాడికి కేజీబీవీలో నూతన సంవత్సర వేడుకలు



గుంతకల్లు: జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పోలీసులు



పామిడి సీఎస్ఐ చర్చిలో గీతాలాపన



గుత్తి రూరల్: ఎంపీపీ విశాలాక్షికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు



గుంతకల్లు టౌన్: చైర్‌పర్సన్ భవానికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



పెద్దవడుగూరు: ఐఎన్ఈసీ చర్చిలో ప్రార్థనలు

బీకేఎస్ సీఐగా వెంకటేశ్వర్లు



బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల సీఐగా వెంకటేశ్వర్లుగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ నాగార్జున రెడ్డి వీఆర్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో సీఐగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు బీకేఎస్ మండలానికి సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా స్టేషన్‌కు వచ్చి కలవాలన్నారు.

పట్టణ బలిజ సంఘం నూతన కమిటీ ఎన్నిక



హరినాథ్ రాయల్, పట్టణ అధ్యక్షుడు

గుత్తి: పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయల కార్యాలయంలో సోమవారం బలిజ కులస్తుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుత్తి పట్టణ నూతన బలిజ సంఘం కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా శ్రీకరం హరినాథ్ రాయల్, ప్రధాన కార్యదర్శిగా గురు, మరో పది మంది ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన పట్టణ అధ్యక్షుడు శ్రీకరం హరినాథ్ రాయల్ మాట్లాడుతూ.. బలిజ సంఘం అభివృద్ధి, బలిజ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సన్మానం..

ఇటీవల బలిజ సంఘం మండల నూతన అధ్యక్షుడిగా ఎంపికైన బండి సత్యను సోమవారం సన్మానించారు. అమృత్ థియేటర్ సమీపంలో మిత్రబృందం సభ్యులు అబ్దుల్, ఖాజా, వెల్డింగ్ రవూఫ్, రామకృష్ణ , కుళ్లాయి తదితరులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఎస్ఎస్‌జీఎస్ కళాశాల వెబ్‌సైట్ ఆవిష్కరణ

గుంతకల్లు: స్థానిక శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు కరస్పాండెంట్ కేసీ హరి తెలిపారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపక బృందం సమక్షంలో వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వెబ్‌సైట్‌తో కళాశాలకు చెందిన సమాచారం తెలుసుకోవడానికి సులభంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంబంధాల అధికారి బసెటి క్రిష్ణయ్య, అధ్యాపకులు రాకేష్, నటరాజ్, సురేష్, గోపి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల సేవలు మరువొద్దు

గార్లదిన్నె: దేశ చరిత్రలో భీమా కోరెగావ్ పోరాట విజయం, మహర్ అమరవీరులను మరువొద్దని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప పేర్కొన్నారు. సోమవారం స్థానిక బస్టాండ్ సర్కిల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద భీమా కోరెగావ్ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1818 సంవత్సరం జనవరి 1న జరిగిన యుద్ధం విజయాన్ని గుర్తించుకోవాలన్నారు. అమరవీరులను ప్రతిదళితుడు స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, నాగరాజు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇమాంషావలీ షంషీర్ ఊరేగింపు



షంషీర్‌ను ఊరేగించి దర్గాకు తీసుకొస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో ప్రాఖ్యాతి గాంచిన హజరత్ ఇమాంషావలి ఉరుసుకు భక్తులు పోటెత్తారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకూ ఉరుసు ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సోమవారం వేకువజామున హజరత్ ఇమాంషావలీ ప్రతిరూపమైన షంషీర్‌ను డ్రమ్ములు, మేళతాళాయి నడుమ భక్తిశ్రద్ధలతో గ్రామంలో ఊరేగించి ఉదయం 7.30 గంటలకు దర్గావద్దకు తెచ్చారు. భక్తులు షంషీర్‌ను దర్శించుకుని పునీతులయ్యారు. సోమవారం ఉదయం జియారత్‌తో ఉరుసు వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా దర్గాలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు యూనుస్‌బాష, మాబుపీరా, గంగలాపురం ఫక్రుద్దీన్, మైక్‌సెట్ ఆదం, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



వలంటీర్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: పుట్లూరు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ బి.వెంకట రాజేశ్వరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.3,75,000 చెక్కును ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అందజేశారు. వివరాలు.. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన వలంటీర్ బి.వెంకట రాజేశ్వరి బెంగళూరులో చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఉన్నత అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.3,75,000 మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన చెక్కును సోమవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు నూతన కానుక

- గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో కొత్తగా 2,637 పింఛన్ల మంజూరు

శింగనమల/యాడికి/గార్లదిన్నె: ఇచ్చిన హామీకి కట్టుబడి.. విశ్వసనీయను చాటుకుంటూ నూతన ఏడాది సందర్భంగా వైఎస్సార్ పింఛన్ కానుకను సీఎం జగన్ రూ.3 వేలకు పెంచారు. అర్హులను లబ్ధిదారులకు కొత్త పింఛన్లు కూడా మంజూరు చేశారు. శింగనమల నియోజకవర్గంలో ఇప్పటికే 44,420 మంది పింఛన్లు తీసుకుంటుండగా.. కొత్తగా 841 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. శింగనమల మండలానికి 187, గార్లదిన్నె మండలానికి 174, నార్పల మండలానికి 169, పుట్లూరు మండలానికి 95, యల్లనూరు మండలానికి 113 చొప్పున పింఛన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఇప్పటికే 36,833 మంది పింఛన్ సొమ్ము తీసుకుంటుండగా.. కొత్తగా 839 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. గుత్తి మండలానికి 200, గుత్తి అర్బన్‌కు 98, గుంతకల్లు మండలానికి 121, గుంతకల్లు అర్బన్‌లో 196, పామిడి మండలానికి 101, పామిడి అర్బన్‌లో 123 చొప్పున పింఛన్లు మంజూరయ్యాయి. తాడిపత్రి నియోజకవర్గంలో ఇప్పటికే 39,750 మందికి పింఛన్లు వస్తుండగా.. కొత్తగా 957 మందికి మంజూరయ్యాయి. పెద్దపప్పూరు మండలానికి 165, పెద్దవడుగూరు మండలానికి 168, తాడిపత్రి అర్బన్‌లో 260, తాడిపత్రి మండలానికి 174, యాడికి మండలానికి 190 చొప్పున పింఛన్లు కొత్తగా మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు. కాగా ఈనెల 3వ తేదీ నుంచి ఫించన్ల పంపిణీ చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 20 కుటుంబాలు

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. జగన్ పాలనకు మెచ్చి పట్టణంలోని 28వ వార్డుకు చెందిన పలు కుటుంబాలు సోమవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో పట్టణానికి చెందిన సాయి రంగ, పాండు, రామచంద్ర, రమేష్, ప్రభాకర్‌తో పాటు మరో 15 కుటుంబాలకు చెందిన వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వీరికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అలాగే తాడిపత్రి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ పాలనకు ఆకర్షితులై తాము టీడీపీని వీడి, వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పేర్కొన్నారు.

ఫ్యాక్షన్ వద్దు.. పిల్లల చదువే ముద్దు

తాడిపత్రిటౌన్: ఫ్యాక్షన్ వద్దు.. పిల్లల చదువే ముద్దు అంటూ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు తెలియజేశారు. సోమవారం కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి వచ్చిన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలన్నారు. పంతాలకు పోయి ఎలాంటి గొడవలు పెట్టుకొవద్దని సూచించారు. పిల్లలను బాగా చదివించుకుని వారి ఉన్నతికి తోడ్పడాలన్నారు. ప్రభుత్వం కూడా పిల్లల చదువులకు నాడు-నేడు , వసతిదీవెన, విద్యాదీవెన పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని సర్వేలు చెబుతున్నాయన్నారు. జేసీ సోదరులు గ్రామాల్లో గొడవలు పెట్టేందుకు టీడీపీ కార్యకర్తలను ఉసికొల్పుతున్నారని మండిపడ్డారు. సమన్వయంతో గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప గ్రామోత్సవం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో సోమవారం అయ్యప్ప స్వామి మాలధారులు గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం అయ్యప్ప ప్రతిమను ట్రాక్టర్‌లో కొలువుదీర్చి ఊరేగింపు చేపట్టారు. భక్తులు, చిన్నారులు హారతులతో ఊరేగింపులో పాల్గొన్నారు.

కొట్టాలపల్లిలో..


బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని కొట్టాలపల్లిలో సోమవారం సాయంత్రం అయ్యప్ప స్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. తొలుత పల్లకీలో అయ్యప్ప స్వామిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అయ్యప్ప స్వాములు భక్తి గీతాలు పాడుతూ నృత్యాలు చేశారు. అదే విధంగా గ్రామంలో బాలికలు దీపాలతో అయ్యప్ప స్వామికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, గోవిందపల్లి ఎంపీటీసీ ఎర్రినాగప్ప గ్రామస్తులు పాల్గొన్నారు.

భోగేశ్వరాలయంలో..

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో సోమవారం అయ్యప్ప, శివమాలధారుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. మట్టితో తయారుచేసిన విగ్రహాలకు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అనంతరం 3 వేల మందికి అన్నదానం చేపట్టారు. ఏటా నూతన సంవత్సరం 1వ తేదీన పడిపూజ నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.



బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లిలో అయ్యప్ప స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం



పెద్దవడుగూరులో అయ్యప్పకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పామిడి భోగేశ్వరాలయంలో అయ్యప్ప స్వామి పడిపూజ